సాక్షి అనకాపల్లి

బుధవారం । 1 । జనవరి । 2025



కొత్త ఆశలతో.. కొత్త ఏడాదిలోకి..

విశాఖ : పాత క్యాలెండర్‌తో 12 నెలల సావాసం ముగిసింది. ఇంటి గోడతో కొత్త క్యాలెండర్ నేస్తం కట్టింది. గత ఏడాదిలో చూసిన విజయాలు, అపజయాలు, సుఖాలు, దుఃఖాలు జ్ఞాపకాలైపోయాయి. కొత్త సంవత్సరం.. కోటి ఆశలతో రానే వచ్చింది. నూతన సంవత్సరం ఆరంభం అంటేనే మన జీవితంలోకి నూతనత్వాన్ని ఆహ్వానించడం. నవ్య ఆలోచనలు మన మస్తిష్కంలో వికసించాలి. నిరంతరం నూతనోత్తేజం ప్రవహించాలి. సానుకూల దృక్పథంతో కొనసాగడం, ప్రతికూల ఫలితాలు ఎదురైనా వాటిని స్వీకరించగల మనస్తత్వం కలిగి ఉండాలి. నూతన పరిచయాలు, స్నేహాలు మన జీవితంలోకి వస్తుంటాయి. అవి మన ఆలోచనలను ప్రభావితం చేసే ప్రయత్నం చేయవచ్చు. కానీ మన సహజ స్వభావాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యం. లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని చేరుకోవడానికి అవిశ్రాంతంగా కృషి చేయాలి. నిరాశకు తావు లేకుండా, సానుకూల దృక్పథంతో ఈ నూతన సంవత్సరంలో మన ప్రయాణం సాగాలి.

ఎకో టూరిజం అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

- తంతడి, సీతంపాలెం బీచ్‌ల అభివృద్ధికి కార్యాచరణ
- బొజ్జన్నకొండ, కొండకర్ల ఆవ వద్ద ఫుడ్ కోర్టుల ఏర్పాటు
- జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల : జిల్లాలో పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి, ప్రచారానికి ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. ఆమె ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తంతడి, సీతంపాలెం బీచ్‌లలో అభివృద్ధికి భూమి అందుబాటులో ఉందని, అక్కడ పర్యాటక అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సోలారు లైటింగు, వాచ్ టవరు ఏర్పాటుకు పోలీసుశాఖ ప్రతిపాదనలు చేసిందని, టూరిజం శాఖ నుండి స్టాల్స్, టాయిలెట్స్, రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కొండకర్ల ఆవను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయడానికి, పెడల్ బోటు, ఫ్లోటింగ్ రెస్టారెంట్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలన్నారు. జిల్లావ్యాప్తంగా అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, వాలాబు వాటర్ ఫాల్స్ వంటి ప్రదేశాలను గుర్తించి అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో టూరిజం అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని, జిల్లాలో పర్యాటక ప్రదేశాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. బొజ్జన్నకొండ వద్ద ఫుడ్ కోర్టు, కొండకర్ల ఆవ వద్ద పెడల్ బోట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. బుద్ధుని స్థూపాలు గల ప్రదేశాలను చరిత్ర ఆధారంగా అనుసంధానం చేస్తూ ప్రత్యేక ప్యాకేజీ రూపొందించాలని తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం బీచ్‌లలో విపరీతమైన రద్దీ ఉంటుందని, తంతడి, సీతంపాలెం బీచ్ లను అభివృద్ధి చేయడం ద్వారా విశాఖపట్నం వచ్చే టూరిస్టులను ఆకర్శించవచ్చన్నారు. జిల్లాలో అనేక దేవాలయాలు ఉన్నాయని, వాటికి ప్రచారం కల్పించడం ద్వారా టెంపుల్ టూరిజం అభివృద్ధి చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అభివృద్ధి అధికారి కె.మనోరమ, అడిషనల్ ఎస్పీ ఎం. దేవప్రసాద్, ట్రావెల్ అండ్ టూర్ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ కె. విజయమోహన్, హోటల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.వి.ప్రవీణ్ కార్తీక్, కళ్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ఐ.శ్రీనివాస్, ఆర్కియాలజీ డిపార్టుమెంటు కన్సర్వేటర్ మూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు

ఆర్ట్‌ఫుల్ విషెస్

మాడుగుల రూరల్ : ఆంగ్ల సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పెన్సిల్ ముల్లు మీద న్యూ ఇయర్ చెక్కారు. ఎం. కోడూరు గ్రామానికి చెందిన నెయ్యిదొండ గోపాల్. ఈయన గతంలో ఎన్నో సూక్ష్మ కళారుపాలను చెక్కి అబ్బుర పరిచారు. ఈ పెన్సిల్ ముల్లు మీద చెక్కడానికి రెండు గంటల పాటు సమయం పట్టిందని గోపాల్ తెలిపారు. గతంలో ఎం.కోడూరు సచివాలయంలో గ్రామ వలంటీరుగా విధులు నిర్వహించిన గోపాల్ సూక్ష్మ కళలో పలువురి ప్రశంసలు అందుకున్నారు.



నెయ్యిదొండ గోపాల్

కిక్కే కిక్కు



విశాఖ సిటీ: మందుబాబులకు కొత్త సంవత్సరం ముందే వచ్చేసింది. 30వ తేదీ నుంచే సెలబ్రేషన్స్ ప్రారంభించేశారు. మద్యం కిక్కును ఎంజాయ్ చేస్తున్నారు. కేవలం రెండు రోజుల్లోనే రూ.23 కోట్ల మద్యం తాగేశారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎక్సైజ్ శాఖ ద్వారా భారీగా ఆదాయం సమకూరుతుందని కూటమి ప్రభుత్వం భావించింది. అందుకు తగ్గట్టుగానే 31, 1వ తేదీల్లో అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం అమ్మకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఆదివారం నుంచే మందుబాబులు న్యూ ఇయర్ జోష్‌లో ఉన్నారు. దీంతో 30న రూ.14.5 కోట్లు అమ్మకాలు జరిగితే.. 31న రూ.8.5 కోట్లు మద్యం విక్రయాలు జరిగాయి. ఈవెంట్ల నిర్వాహకులతో పాటు పార్టీలు చేసుకునే వారు ముందస్తుగానే మద్యం కొనుగోలు చేశారు. నూతన సంవత్సరానికి ముందే మద్యం ఆదాయం పెరిగింది. ఒకటో తేదీన రెట్టింపు స్థాయిలో జరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.

గ్రాండ్ వెల్‌కమ్



- జిల్లాలో న్యూ ఇయర్ సంబరాల జోష్
- స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
- విద్యుద్దీపాలంకరణలతో ఆలయాలు, చర్చిల ముస్తాబు
- నేలపై వెల్లివిరిసిన ఇంద్ర ధనుస్సులా రంగవల్లులతో మెరిసిన వీధులు

క్యాలెండర్ మారిపోయింది...
టిక్ టిక్..మన్న గడియారం పన్నెండో గంట కొట్టగానే నేడు రేపు సంధిలో కాలం కదలకుండా ఆగిపోయింది..
న్యూ ఇయర్ జోష్ అంబరాన్ని అంటింది...
'ఉందిలే మంచి కాలం ముందుముందునా...' అంటూ ఆశావహ దృక్పథంతో కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నాం.

గడిచిన సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ కోటి ఆశలతో కొత్త సంవత్సరానికి ప్రజలంతా స్వాగతం పలికారు. నేలపైనే ఇంద్ర ధనస్సులు వెల్లి విరిసినట్టుగా రంగు రంగుల రంగవల్లులతో వీధులన్నీ ముస్తాబయ్యాయి. చర్చిలను, దేవాలయాలను ప్రత్యేక విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు జిల్లాలో పలు చోట్ల ఘనంగా సాంస్కృతిక సంబరాలు జరుపుకొన్నారు. చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ప్రత్యేక దర్శనాలు కల్పించారు. పండ్ల దుకాణాలు, స్వీట్‌స్టాల్స్, బేకరీలు, పూల దుకాణాలు, గ్రీటింగ్ షాపులు, ఆఫర్లతో బిర్యానీ దుకాణాలు, రెస్టారెంట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

- తుమ్మపాల, దేవరాపల్లి, చోడవరం, యలమంచిలి



ఆఫర్లతో బిర్యాని దుకాణాలు, రెస్టారెంట్లు

కొంగొత్త బాసలతో

ఆశల పల్లకిలో కొత్త సంవత్సరానికి యువత స్వాగతం పలికింది. 2024సంవత్సరానికి వీడ్కోలు చెప్పి 2025కు స్వాగతం చెబుతూ వివిధ కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. అర్ధరాత్రి కేక్‌లు కట్ చేసి, బాణాసంచా వెలుగుల్లో సంబరాలు జరిపారు. కోటి ఆశలతో కొత్త ఏడాది కోసం కొంగొత్త బాసలు చేసుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యం



నేను ఫిజిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్. ప్రస్తుతం యలమంచిలిలో ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నాను. అమ్మానాన్న వ్యవసాయం చేస్తూ నన్ను పీజీ వరకు ఎంతో కష్టపడి చదివించారు.వారి కష్టానికి తగ్గట్టు చదువుకున్నాను. ఈ ఏడాది ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలి. అప్పుడే నాలాంటి నిరుద్యోగులందరికీ ప్రయోజనం కలుగుతుంది.

-కటారి పద్మ, ప్రైవేటు కళాశాల అధ్యాపకురాలు, యలమంచిలి

కొత్త వెలుగులు నిండాలి



ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. నూతన సంవత్సరంలో అందరి కుటుంబాలలో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, విద్యాపరంగా అభివృద్ధి సాధించాలి. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా సహాయం పొందుతున్న వివిధ వర్గాల ప్రజలందరూ ఆర్థిక అభ్యున్నతి సాధించాలి. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నూతన సంవత్సరం మరో మైలురాయి కావాలని ఆకాంక్షిస్తున్నాను.

- విజయ కృష్ణన్, జిల్లా కలెక్టర్

సుఖసంతోషాలు వెల్లివిరియాలి



జిల్లా ప్రజలంతా నూతన సంవత్సరంలో ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో సుభిక్షంగా జీవించాలని కోరుకుంటున్నాను. ప్రజలందరికీ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను. కొత్త సంవత్సరంలో జిల్లా ప్రజలందరిపై భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను.

-బూడి ముత్యాలనాయుడు మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

నిరాశ నుంచి ఆశల్లోకి...



గడచిన సంవత్సరం కొందరికి సుఖం, మరికొందరికీ దుఃఖం మిగిల్చింది. కష్టాలు, నష్టాలు, నిరాశలో వున్నవారు డీలా పడిపోకుండా, భవిష్యత్ చక్కని ఆశలతో వుండాలని ఆకాంక్షిస్తూ, మనోధైర్యంతో న్యూ ఇయర్‌కు స్వాగతం చెప్పాలి. నిత్య నూతన ఆలోచనలు, కార్యాచరణ ప్రణాళికలను ఎవరికి వారే రూపొందించుకుని నిరంతరం శ్రమిస్తే, అద్భుత మైన ఫలాలను కాలం అందజేస్తుంది. అందుకే ఈ కొత్త సంవత్సరం ఆత్మ విశ్వాసంతో నిరంతరం శ్రమించాలని నిర్ణయించుకున్నాను.

-సీహెచ్ నవీన్, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్, పాతవీధి, యలమంచిలి

ఫ్లాష్...2024

తగ్గుముఖం పట్టని నేరాలు

'గతేడాదితో పోల్చితే ఈ ఏడాది నేరాలు, ఘోరాలు పెరిగాయి. హత్యలు, హత్యాయత్నాలతో పాటుగా రోడ్డు ప్రమాదాలు కూడా పెరిగాయి. గంజాయి, సైబర్, సారా కేసులు కూడా ఎక్కువగా నమోదయ్యాయి. గతేడాదిలో 15 హత్యలు, 25 హత్యాయత్నాలు జరిగితే ఈ ఏడాదిలో 25 హత్యలు, 38 హత్యా ప్రయత్నాలు నమోదయ్యాయి. మంగళవారం 2024వ సంవత్సర వార్షిక నివేదిక వివరాలు ఎస్పీ తుహిన్ సిన్హా మీడియాకు వెల్లడించారు.





2024 ఏడాది వార్షిక నివేదిక వెల్లడించిన ఎస్పీ తుహిన్ సిన్హా

సాక్షి, అనకాపల్లి :

మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా అనకాపల్లి తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖలో సమర్థవంతమైన సిబ్బంది పనితీరు, మెరుగైన పోలీసింగ్‌తో నేరాలను అదుపులో ఉంచగలిగామని పేర్కొన్నారు. ఈ ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలను సమర్థంగా నిర్వహించడంలో పోలీసులు కీలక పాత్ర పోషించామన్నారు. పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ మరణించిన సిబ్బంది కుటుంబ సభ్యులకు, వారి పిల్లలకు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలందించామన్నారు. సిబ్బంది కోసం ప్రతి నెలా మూడో శుక్రవారం గ్రీవెన్స్ డే, హోంగార్డుల సమస్యలను పరిష్కరించడానికి దర్బార్ ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు.

చట్టాలపై అవగాహన కల్పించేలా...

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు పోక్సో చట్టం, మహిళా చట్టాలు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటి వాటిపై అవగాహన కల్పించడంతో పాటు యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేశామని ఎస్పీ అన్నారు. పోలీసు శాఖలో మహిళా సంరక్షణ కార్యదర్శులతో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం, లోన్ యాప్‌ల వల్ల అనర్థాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు అరికట్టడం పట్ల అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.

51 శాతం కేసుల్లో శిక్షలు ఖరారు

2024లో డిస్పోజ్ అయిన కేసుల్లో 51 శాతం కేసుల్లో నిందితులకు శిక్ష ఖరారయ్యాయి. మొత్తం 4,618 కేసులు డిస్పోజ్ కాగా..వాటిలో 2,367 కేసుల్లో నిందితులను శిక్షించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా 2,734 ఎఫ్ఐఆర్ కేసులు, 5,315 పెట్టీ కేసులు డిస్పోజ్ అయ్యాయి. దర్యాప్తులో ఉన్న 12,623 పోలీసు కేసుల్లో 7,071 కేసులు పరిష్కరించారు.


గంజాయికు అడ్డుకట్ట..

మాదక ద్రవ్య రహిత జిల్లాగా చేసే విధంగా గంజాయి అక్రమ రవాణా మార్గాలను అరికట్టేందుకు 5 శాశ్వత చెక్‌పోస్టులను, 11 డైనమిక్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహన తనిఖీ పోలీసు జాగిలాలు, డ్రోన్లు నిఘా కూడా ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. జిల్లాలో నేరాలకు పాల్పడుతున్న వారు ఎక్కువగా ఉన్న 16 మండలాలలోని 63 గ్రామాలను గుర్తించి మండల, గ్రామ స్థాయి యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, జిల్లాలో 475 మందిపై హిస్టరీ షీట్‌లను కూడా తెరిచామని ఎస్పీ అన్నారు. గంజాయి రవాణాపై జిల్లా పోలీసులు 161 కేసులు నమోదు చేసి మొత్తం 7326.43 కిలోల గంజాయి, 4 లీటర్ల హషీష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులతో సంబంధం ఉన్న 420 మందితో పాటుగా పరారీలో ఉన్న 126 మంది నిందితులను అరెస్టు చేశారు. 113 గంజాయి వాహనాలను సీజ్ చేశారు. రోలుగుంట పోలీసు స్టేషన్ పరిధిలో పడాల నాగేశ్వరరావు గంజాయి క్రయ విక్రయాల ద్వారా అక్రమంగా సంపాదించిన రూ.2 కోట్లు విలువ గల 15.36 ఎకరాల వ్యవసాయ భూమిని స్వాధీనం చేసుకున్నామన్నారు. సంకల్పం కార్యక్రమం ద్వారా 156 కాలేజీలు, 306 స్కూళ్లలో గల 72 వేల మంది విద్యార్థులకు అవగాహన కల్పించామని, మాదకద్రవ్యాలకు బానిసలైన వారికి చికిత్స చేసేందుకు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో 15 బెడ్లను ఏర్పాటు చేశారు.

696 రోడ్డు ప్రమాదాలు..

గతేడాదిలో 689 రోడ్డు ప్రమాదాల కేసుల్లో 294 మంది మృతి చెందారు. 2024లో నమోదైన 696 రోడ్డు ప్రమాదాల కేసుల్లో 316 మంది మృతి చెందారు. రహదారి భద్రతా చర్యల్లో భాగంగా 2024 ఏడాదిలో 4,332 కేసులు నమోదయ్యాయి. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై 12,282 కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై 93,713 ఈ చలానాలు విధించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా 26 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి ఆయా ప్రదేశాలలో స్టాప్ బోర్డులు, షైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించుటకు కృషి చేశామన్నారు.

సారా కేసులూ..



2023లో 1378 నాటు సారా కేసుల్లో 1119 అరెస్ట్ చేశారు. 5,906 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 2024లో 277 నాటుసారాయి కేసులు నమోదు చేసి 4,287 లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు 2,09,100 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసి 307 మందిని అరెస్టు చేశారు. బెల్ట్ షాపుల నుంచి 12,445 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని 2461 కేసులు నమోదు చేసి 2054 మందిని అరెస్ట్ చేశారు. 38 వాహనాలు సీజ్ చేశారు.

పెరిగిన హత్యలు

గత ఏడాది 2023లో అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా 15 హత్యలు జరగ్గా.. 25 హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. 2024లో 25 హత్యలు, 35 హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. 2 లాభాపేక్ష హత్యలు, 38 హత్యాప్రయత్నాలు, 34 తీవ్ర గాయాల కేసులు నమోదయ్యాయి. 482 సాధారణ గాయాలు అయిన కేసులు నమోదయ్యాయి. ఆస్తికి సంబంధించిన నేరాల్లో 2024లో 127 ఆస్తి సంబంధిత నేరాల్లో రూ.1,96,83,090 రికవరీ చేశారు. ఈ ఏడాది నమోదైన హత్య కేసుల్లో చాలా వరకు కుటుంబ తగాదాలు, వివాహేతర సంబంధాల కారణంగా జరిగినవే.

సైబర్ కేసులపై అప్రమత్తం

గతేడాదిలో 57 సైబర్ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో 103 సైబర్ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో సైబర్ మోసగాళ్లకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో రూ. 2,41,53,923 ఫ్రీజ్ చేశారు. అంతేకాక పై కేసుల్లో రూ. 16,97,759 లను బాధితులకు తిరిగి అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌పై 4,332 కేసులు

గత ఏడాది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై 4,332 కేసులు నమోదు చేసి రూ.44,03,190 జరిమానా విధించారు. వారిలో నలుగురికి సాధారణ జైలు శిక్ష విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 12,282 మందిపై కేసులు నమోదు చేసి, రూ.23.08 లక్షలు జరిమానా విధించారు. 664 కేసుల్లో 2,610 మంది జూదగాళ్లను అరెస్టు చేసి రూ.48.04 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

మొబైల్ ఫోన్ల రికవరీ...

మొబైల్ చోరీ కేసుల్లో అనకాపల్లి జిల్లా పోలీసు మొత్తం 8 విడతల్లో 2,208 మొబైల్ ఫోన్లను (సుమారు విలువ రూ.2 కోట్ల 80 లక్షల రూపాయలు) ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి రికవరీ చేసి బాధితులకు అందించారు.

పీజీఆర్ఎస్‌కు 2,803 ఫిర్యాదులు

గడిచిన ఏడాది పీజీఆర్ఎస్‌లో 2,803 ఫిర్యాదులు, 464 సీసీసీ పిటిషన్‌లు నమోదయ్యాయి. వాట్సాప్ కాల్స్ ద్వారా 10,939 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 108 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

నేరము...శిక్ష

పోస్కో కేసుల్లో...

చీడికాడ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫోక్సో కేసులో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షను కోర్టు విధించింది. నాతవరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి జీవితాంతం కఠిన కారాగార శిక్షతో పాటు రూ.12వేల జరిమానా విధించారు. మునగపాక పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో ఐదేళ్లలో కఠిన కారాగార శిక్షతో పాటు రూ.17వేల జరిమానా విధించారు. రోలుగుంట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసు, ఫోక్సో కేసులో 3 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.30వేల జరిమానా విధించారు.

హంతకులకు కారాగారం..

కోటకోట పోలీస్ స్టేషన్‌లో 2017లో నమోదైన హత్య కేసులో కోర్టు నిందితుడికి జీవిత కఠిన కారాగార శిక్ష విధించింది. నాతవరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసులో పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,00,000 జరిమానాను విధించారు. రోలుగుంట పోలీస్‌స్టేషన్‌లో 2017లో నమోదైన హత్యకేసులో నిందితునికి జీవిత ఖైదు విధించారు.

క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైరపర్సన్ సుభద్ర

మహారాణిపేట(విశాఖ): పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకొని వస్తే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర తెలిపారు. మంగళవారం ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం 2025, నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. జెడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీర్. కె. శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీఎస్ఎస్ ప్రసాద్, జిల్లా సంఘం అధ్యక్షుడు ఎస్. సత్తిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి. సీతారామరాజు, గౌరవాధ్యక్షుడు యూ.కూర్మారావు, జిల్లా సంఘం ట్రెజరర్ ఎస్.త్రినాథరెడ్డి పాల్గొన్నారు.

ఏడు కేసుల్లో ముగ్గురు దొంగల అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీ లక్ష్మణరావు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన దొంగలను పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 7 కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు వెస్ట్ జోన్ క్రైం ఏసీపీ డి.లక్ష్మణరావు తెలిపారు. వారి నుంచి రూ.6 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మంగళవారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో తెలిపిన వివరాలు.. సుజాతనగర్ ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన చాగంటి నాగరత్నం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని బంధువు మరణంతో అక్కడకు వెళ్ళారు. ఈ నెల 19న తిరిగి వచ్చారు. ఈ క్రమంలో ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా ఇంట్లోని బీరువాలో దాచిన 4 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి వస్తువులు కనిపించలేదని నాగరత్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పాటు మరో ఆరు హౌస్ బ్రేకింగ్ ఘటనలలో వెండి, రాగి వస్తువుల చోరీ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ముద్దాయిలు అల్లిపురానికి చెందిన ఉమ్మిడి సతీష్, ఎరిపల్లి మూర్తి, షేక్ నజీర్‌లను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వెల్లడించారు. వీరు ముగ్గురు గత కొంత కాలంగా పెందుర్తి ప్రాంతంలోనే చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. వెస్ట్ జోన్ సీఐ(ఇంచార్జి) శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయా కేసులను పెందుర్తి సబ్ ఇన్‌స్పెక్టర్ డి.సూరిబాబు బృందం దర్యాప్తు చేసిందన్నారు. క్రైం ఎస్‌ఐ డి.సూరిబాబు, హెచ్‌సీలు జి.నాగరాజు, ఎం.ఎస్. నాయుడు, ఆర్.శ్రీరాం, ఎన్. భవాని, పీసీలు టి.శివప్రసాద్, ఎల్.తాతారావు, ఆర్.వెంకటేష్‌లను ప్రత్యేకంగా అభినందించారు.

ఆరు నెలల్లో ఏమీ చేయలేకపోయాం..

- ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అసహనం
- గంజాయి నియంత్రణలో విఫలమయ్యారని ఎస్‌ఐలపై ఆగ్రహం
- ఇందుకు దీటుగా ప్రతి స్పందించిన సీఐ ధనుంజయరావు
- వాడీవేడిగా యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు దీటుగా సమాధానమిస్తున్న సీఐ ధనుంజయరావు

యలమంచిలి రూరల్: 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైంది.. తరచూ యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలకు హాజరవుతున్నాను. పట్టణాభివృద్ధికి, ఎన్నో సమస్యల గురించి ఇక్కడ చర్చిస్తున్నా వాటిని అమలు చేయడంలో అధికారులు, స్థానిక కౌన్సిలర్లు విఫలమవుతుండడంతో నేను కూడా ఏమీ చేయలేకపోతున్నా' అంటూ ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మంగళవారం జరిగిన యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అసహనం వ్యక్తం చేశారు. అజెండాలోని అంశాలపై చర్చ పూర్తిగా పక్కదోవ పట్టడం, గంజాయి నియంత్రణపై పోలీసులు విఫలమవుతున్నారని యలమంచిలి పట్టణ, రూరల్ ఎస్‌ఐలు సావిత్రి, ఉపేంద్రలపై ఎమ్మెల్యే సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేయడం.. దీనికి ప్రతిస్పందనగా సీఐ ధనుంజయరావు దీటుగా తనదైన శైలిలో సమాధానం ఇవ్వడం వంటి ఆసక్తికర పరిణామాలతో సమావేశం వాడీవేడిగా సాగింది. 'చర్య మీరైనా తీసుకోండి.. లేకపోతే నేనైనా తీసుకుంటాను.. మీరు చర్య తీసుకోకపోతే నేనెలాంటి చర్య తీసుకుంటానో మీకు తెలుసు.. ఉద్యోగాలు చేయండి.. లేకపోతే లేదు..' అని ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో ఎస్‌ఐలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కొంతసేపటికి సమావేశానికి వచ్చిన యలమంచిలి సీఐ ధనుంజయరావు గంజాయి నియంత్రణ, పట్టణంలో నాగుల చవితి పంచరాత్రి ఉత్సవాల సమయంలో పోలీసులు విఫలమయ్యారని అనడంపై ఘాటుగా స్పందించారు. సీఐ మాట్లాడుతుండగా.. ఎమ్మెల్యే సుందరపు వినండి అంటూ ఏదో చెప్పడానికి ప్రయత్నించగా.. మీరు ఆగండి నా మాట వినండి అంటూ సీఐ తాను చెప్పాల్సిన విషయాన్ని గట్టిగా చెప్పారు. శాంతి భద్రతలు, గంజాయి నియంత్రణ విషయంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని, ఎవరి మాటా వినేది లేదని స్పష్టం చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతుండగా చైర్‌పర్సన్ రమాకుమారి జోక్యం చేసుకోవడంపై ఎమ్మెల్యే మీరు ఆగండి అంటూ రెండు సార్లు చెప్పడాన్ని అధికారులు, ప్రజలు ఆసక్తిగా చర్చించుకున్నారు. మొత్తమ్మీద సమావేశంలో అజెండాలో అంశాలు, పట్టణంలో ప్రధాన సమస్యలపై చర్చ జరగకుండా పూర్తిగా పక్కదారి పట్టింది. ఎమ్మెల్యే సమావేశానికి రాక ముందు కొందరు వైఎస్సార్‌సీపీ సభ్యులు తమ వార్డుల్లో వీధిలైట్లు వెలగడం లేదని, డ్రైనేజీలు ఆక్రమించి కట్టడాలు కడుతున్నారని ప్రస్తావించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు సత్య గుప్తా, పలువురు వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మలేరియా కార్మికులకు షాక్!



- కొత్త సంవత్సరం రోజు తొలగింపు
- రోడ్డున పడ్డ 431 మంది కార్మికులు
- తమ పొట్టకొట్టారంటూ ఆందోళన

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

కొత్త సంవత్సరంలో కూటమి ప్రభుత్వం సీజనల్ యాంటీ లార్వా ఆపరేషన్ వర్కర్లకు (మలేరియా కార్మికులు) షాక్ ఇచ్చింది. జీవీఎంసీ మలేరియా విభాగంలో పనిచేస్తున్న 431 మందిని జనవరి 1వ తేదీ నుంచి పనిలోకి రావద్దంటూ ఆదేశాలు జారీచేసింది. రోజువారీ వేతనం ఆధారంగా పనిచేస్తున్న వీరిని తొలగిస్తూ ఆదేశాలు జారీకావడంతో.. వారంతా ఘొల్లుమంటున్నారు. కొత్త సంవత్సరంలో తమ పొట్టకొట్టారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి జీవీఎంసీ పరిధిలో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వం 431 మంది సీజనల్ యాంటీ లార్వా ఆపరేషన్ వర్కర్లను 2023 సెప్టెంబర్‌లో పనిలోకి తీసుకుంది. ఇందులో 25 మంది కేజీహెచ్, విక్టోరియా గవర్నమెంట్ హాస్పిటల్లో పనిచేస్తున్నారు. అప్పటి నుంచి వీరు విశేష సేవలందిస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో వీరు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం నగరంలో దోమల బెడద తీవ్రంగా ఉంది. మలేరియా, డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో వీరి సేవలను కొనసాగించాల్సిన అవసరం ఉంది. సీజన్ ముగిసినందున వీరి అవసరం లేదని పేర్కొంటూ తొలగిస్తున్నట్టు జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ (సీఎంహెచ్‌వో) ఆదేశాలు జారీ చేశారు.

జోన్ల వారీగా వివరాలు

జోన్	వార్డులు	సిబ్బంది
జోన్-1	4	18
జోన్-2	9	79
జోన్-3	14	45
జోన్-4	12	25
జోన్-5	24	63
జోన్-6	20	98
జోన్-7	5	25
జోన్-8	10	53
మొత్తం	98	406

కేజీహెచ్, విక్టోరియా గవర్నమెంట్ హాస్పిటల్లో మరో 25 మంది పనిచేస్తున్నారు.

పనిలోకి తీసుకోవద్దు..!

తుపాన్‌ల వల్ల మొన్నటివరకు వర్షాలు విరివిగా కురవడంతో ఎక్కడికక్కడ నీరు నిల్వ ఉండిపోయింది. ఇక్కడ యాంటీ లార్వా ఆపరేషన్లను నిర్వహించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా నగరంలో ఇప్పటికీ దోమల బెడద తీవ్రంగా ఉంది. వీటిని నియంత్రించేందుకు ఎప్పటికప్పుడు ఫాగింగ్ ప్రకియ చేపట్టాలి. అయితే ఇది సరిగ్గా జరగడం లేదు. ఈ పరిస్థితుల్లో సీజనల్ యాంటీ లార్వా ఆపరేషన్ వర్కర్ల అవసరం ఎంతైనా ఉంది. కానీ భారం పేరుతో కొత్త సంవత్సరం మొదటి రోజు నుంచే వీధుల్లోకి తీసుకోవద్దంటూ జోనల్ మలేరియా అధికారులకు జీవీఎంసీ ఆదేశాలు జారీచేయడంతో వారంతో గగ్గోలు పెడుతున్నారు. ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఉన్న ఉపాధిని తీసేస్తోందని మండిపడుతున్నారు.

అర్ధాంతరంగా ఆపేస్తే ఎలా?



మలేరియా, డెంగీ వ్యాధుల నియంత్రణ చర్యల అమలుకు సీజనల్ యాంటీ లార్వా ఆపరేషన్ వర్కర్లను తీసుకున్నారు. ఇప్పుడు అర్ధాంతరంగా ఆపేస్తే ఎలా? నగర ప్రజలకు దోమలు కుట్టవా? జబ్బులు, జ్వరాలు రావా.? ఈ విషయమే బయాలజిస్ట్‌ని కలిసి చెప్పా. అందుకు బయాలజిస్ట్ స్పందిస్తూ త్వరలోనే తీసుకునే ప్రయత్నం చేస్తామని హామీనిచ్చారు.

– పి.వెంకటరెడ్డి, గౌరవ అధ్యక్షుడు, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

దివ్యాంగులతో సదరంగం

- నేటి నుంచి సదరం సర్టిఫికెట్ల జారీకి బ్రేక్
- దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లపై కూటమి కుట్ర



మహారాణిపేట(విశాఖ): దివ్యాంగులపై కూటమి ప్రభుత్వం కుట్రకు సిద్ధమవుతోంది. వారికి అందించే పింఛన్‌లో భారీగా కోత విధించాలని ఆలోచన చేస్తోంది. తద్వారా పింఛన్ భారాన్ని తగ్గించుకోవాలని భావిస్తోంది. ఒకవైపు ఉన్న వారిని తగ్గించడంతో పాటు తనిఖీల పేరుతో కొత్త లబ్ధిదారులు పింఛన్ పొందే అవకాశం లేకుండా చేస్తోంది. ఇందులో భాగంగా జనవరి ఒకటో తేదీ నుంచి సదరం సర్టిఫికెట్ల జారీకి బ్రేక్ వేసింది. దీంతో ఈ ప్రక్రియ నిలిచిపోనుంది. దీని వల్ల దివ్యాంగ పింఛన్ కోసం కొత్తగా ఎవరూ దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి నెలకొంది.

సదరం కీలకం

దివ్యాంగ పింఛన్‌కు సదరం సర్టిఫికెట్ ఎంతో కీలకం కానుంది. ఇది లేకుండా పింఛన్ పొందే అవకాశం లేదు. ఆర్థోపెడిక్, అంధత్వం, వినికిడి, మానసిక రుగ్మతలు, శారీరక వైకల్యం, మానసిక, శారీరక లోపాలు, దృష్టిలోపంతో బాధపడే వారి వైకల్యాన్ని నిర్ధారిస్తూ సదరం సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ సర్టిఫికెట్ ఉంటేనే దివ్యాంగులకు పింఛను, ఉద్యోగాల భర్తీ, బస్ పాస్, ఇతర సదుపాయాలు వర్తిస్తాయి. ఈ సర్టిఫికెట్ లేకపోతే దివ్యాంగులుగా గుర్తించే అవకాశం లేదు. తాజాగా పింఛన్ల భారాన్ని తగ్గించుకోడానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో దివ్యాంగులు మిగిలిన రాయితీలు, సౌకర్యాలు పొందలేని పరిస్థితి నెలకొంది. దీంతో దివ్యాంగుల్లో కలవరం మొదలైంది.

వారంలో 240 నుంచి 280 మంది దరఖాస్తులు

కేజీహెచ్‌తోపాటు ప్రభుత్వ విక్టోరియా, ఈఎన్‌టీ, మానసిక ప్రభుత్వ ఆస్పత్రితో పాటు పలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఈ సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. వారంలో 240 నుంచి 280 మంది సదరం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. వైద్య పరీక్షలు పూర్తయిన 15 రోజుల్లో సర్టిఫికెట్లు ఆన్‌లైన్ ద్వారా జారీ అయ్యేవి.

3 నుంచి తనిఖీలు

జనవరి 3వ తేదీ నుంచి సదరం సర్టిఫికెట్ ద్వారా పింఛన్లు పొందుతున్న వివరాలపై సర్వే చేయనున్నారు. సదరం సర్టిఫికెట్ ద్వారా మంచానికి పరిమితమైన పలువురికి, 80 శాతం నుంచి వంద శాతం వైకల్యం ఉన్నవారికి నెలకు రూ.15 వేలు పింఛను అందజేస్తున్నారు. దివ్యాంగుల్లో కేటగిరీని బట్టి రూ.5 వేలు, రూ. 10వేలు,రూ.15 వేలు చొప్పున ఇస్తున్నారు. అలాగే కిడ్నీ డయాలసిస్ రోగులకు కూడా రూ.15 వేలు పింఛను అందజేస్తున్నారు. కూటమి పింఛన్ల భారం తగ్గించేందుకు దివ్యాంగుల్లో అనర్హులున్నారని రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం మొదలుపెట్టింది. అనర్హుల ఏరివేత పేరుతో పింఛన్ల భారం తగ్గించుకోవాలని చూస్తోంది. పింఛన్లు పొందుతున్న వారికి ప్రత్యేక వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమాచారాన్ని వివిధ శాఖల అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ నుంచి గానీ, దివ్యాంగుల శాఖ నుంచి గానీ ఎలాంటి సమాచారం రావడం లేదు. సదరం నిలుపుదల చేశామని, 3వ తేదీ నుంచి సర్వే జరుగుతుందని మాత్రమే చెప్పి తప్పించుకుంటున్నారు.

ఎట్టకేలకు..!



- ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం
- సెర్చ్ కమిటీకి ఈసీ నామినీ పేరు
- వీసీ నియామకంలో ముందడుగు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నియామకంలో ముందడుగు పడింది. రాష్ట్ర స్థాయి 'సెర్చ్ కమిటీ'కి వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ నుంచి నామినీ పేరును ఎట్టకేలకు ఖరారు చేశారు. ఏయూలో మంగళవారం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఉన్నత విద్యామండలి నుంచి కౌన్సిల్‌లోని కీలక సభ్యులుగా ఉన్న అధికారులు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొనగా, ఇక్కడ అందుబాటులో ఉన్న మిగతా సభ్యులంతా హాజరై నామినీపై తుదినిర్ణయం తీసుకున్నారు. దీంతో వీసీ నియామకానికి లైన్ క్లియర్ అయినట్లయింది. ప్రస్తుతం ఇన్‌చార్జి వీసీగా జి.శశిభూషణరావు ఉన్నారు. రెగ్యులర్ వీసీ నియామకంపై కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. వీసీ ఎంపిక కోసం రాష్ట్ర స్థాయిలో ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వం, యూజీసీ నుంచి ఒక్కో సభ్యుడి పేరు ఖరారు చేసినా, ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నుంచి సభ్యుడి పేరును సిఫార్సు చేయటంలో తీవ్ర జాప్యం నెలకొంది. ఇటీవల ఉన్నత విద్యామండలి చైర్మన్ నియామకం జరగడంతో దీనిపై కదలిక వచ్చింది. వీసీ పోస్టు కోసం సెర్చ్ కమిటీ ముగ్గురు పేర్లను సూచిస్తే, అందులో ఒకరిని గవర్నర్ ఫైనల్ చేయనున్నారు. ఇదిలా ఉండగా, ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో కీలకమైన ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు, రెక్టార్ కిశోర్ బాబు హాజరుకాకుండానే సమావేశం ముగిసింది. ఈ ముగ్గురు వీసీ పోస్టు కోసం దరఖాస్తు చేయడంతోనే కౌన్సిల్ సమావేశానికి దూరం కావాల్సి వచ్చింది. నామినీ పేరు ఖరారైన నేపథ్యంలో త్వరలోనే వీసీ పోస్టుపై నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో చోడవరం క్రీడాకారుల సత్తా



పతకాలు సాధించిన తైక్వాండో క్రీడాకారులు తన్విత్, ఉదయ్

చోడవరం: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో చోడవరం క్రీడాకారులు పతకాలు సాధించారు. గత నెల 27 నుంచి 29వ తేదీ వరకు 5వ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలో జరిగాయి. ఈ పోటీల్లో తైక్వాండో పూమ్‌సే విభాగంలో చోడవరం పరిసర ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు కొల్లిపార తన్విత్, ఉదయ్ సబ్ జూనియర్స్‌లో బంగారు పతకం, క్యోరుగి అండర్ 32 డివిజన్‌లో రజత పతకం, కెడేడట్ పూమ్ సేలో కాంస్య పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఉమ్మడి విశాఖ జిల్లా తరపున వీరు జాతీయ స్థాయి పోటీల్లో పోటీపడి సత్తా చాటారు. వారిని ఏపీ తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళి, కోచ్‌లు ప్రసాద్, శేఖర్ అభినందించారు.

ప్రశాంతంగా కానిస్టేబుళ్ల నియామక పరీక్షలు



పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

ఆరిలోవ(విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో కానిస్టేబుళ్ల అభ్యర్థులకు కై లాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో శారీరక దారుఢ్య పరీక్షలు మంగళవారం నిర్వహించారు. 600 మంది అభ్యర్థులకు 221 మంంది హాజరయ్యారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పర్యవేక్షణలో పోలీస్ అధికారులు అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. అనంతరం బయోమెట్రిక్, బ్యాగేజ్ కౌంటర్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ (పీఎంటీ), ఫిజకల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ) నిర్వహించారు. అనంతరం 1,600 మీటర్లు, 100 మీటర్లు పరుగు పోటీలు, లాంగ్ జంప్ నిర్వహించారు. పోటీల నిర్వహణలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మి, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ టి.కల్యాణి, ఆర్‌ఐలు మన్మథరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో నూతన సంవత్సర వేడుకలు

- పాల్గొన్న పదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.శ్రీవిద్య



కేక్ కట్ చేస్తున్న పదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.శ్రీవిద్య

అనకాపల్లి : నూతన సంవత్సరంలో కొత్త ఆకాంక్షలతో అడుగు పెట్టాలని, గడిచిన కాలాన్ని జ్ఞాపకాలుగా నిలుపుకోవాలని, ముందున్న సవాల్‌ను ఎదుర్కొనే దిశగా అడుగులు వేయాలని జిల్లా పదో అదనపు న్యాయమూర్తి ఎన్.శ్రీవిద్య అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమె కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోను, రాష్ట్రంలోను ప్రజల సుఖశాంతులతో మంచి బుద్ధితో మెలగాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు, మొదటి తరగతి అడిషనల్ సివిల్ జడ్జి రమేష్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జె.వి.ఎస్.కుమార్, కార్యదర్శి దుర్గారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానంపై అవగాహన



మాట్లాడుతున్న సుధాకర్ సి.అగార్కర్

పాయకరావుపేట: జాతీయ విద్యా విధానం-2020పై అవగాహన అవసరమని వీపీఎం అకాడమీ ఆఫ్ ఇంటర్నేనల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్ సి.అగార్కర్ అన్నారు. స్పేసెస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ విద్యా విధానంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సంపూర్ణ మానవ సామర్థ్యాన్ని సాధించేందుకు విద్య ప్రధానమన్నారు. విద్యా వ్యవస్థ మౌలిక సంస్కరణల్లో ఉపాధ్యాయుడు తప్పనిసరిగా కేంద్ర బిందువుగా ఉండాలని సూచించారు. అన్ని స్థాయిల్లో చురుకుతనం, తెలివైన వారు బోధన వృత్తిలో ప్రవేశించేలా కృషి చేయాలన్నారు. ఆన్‌లైన్, డిజిటల్ విద్యపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎ.ఆర్.కె.రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు పాల్గొన్నారు.

తమిళనాడుపై విదర్భ విజయం

విశాఖ స్పోర్ట్స్: విజయ్ హజారే ట్రోఫీ గ్రూప్-డీ పోటీల్లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో విదర్భ ఆరు వికెట్ల తేడాతో తమిళనాడుపై గెలుపొందింది. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన తమిళనాడు మరో ఎనిమిది బంతులుండగానే 256 పరుగులకు ఆలౌటైంది. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన విదర్భ ఓపెనర్లు ధ్రువ్ 31, రాథోడ్ 14 పరుగులతో పెవిలియన్‌కు చేరగా వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ కరణ్ 111(14 ఫోర్లు, ఒక సిక్సర్) పరుగులతో అజేయంగా నిలిచాడు. యష్(31), కీపర్/బ్యాటర్ శర్మ(23) నిలకడగా రాణించారు. దూబే 39 పరుగులతో నిలిచాడు. దీంతో నాలుగు వికెట్లు మాత్రమే నష్టపోయి 257 పరుగులతో జట్టు విజయాన్నందుకుంది.


నేటి నుంచి రైళ్ల వేళల్లో స్వల్పమార్పులు

తాటిచెట్లపాలెం(విశాఖ): కొత్త సంవత్సరం తొలి రోజు నుంచి పలు రైళ్ల వేళలు మారాయి. అయా స్టేషన్ల నుంచి బయల్దేరే, ఆయా స్టేషన్‌లకు చేరుకునే సమయాల్లో స్వల్పమార్పులు చేశారు. విశాఖకు చేరుకునే సమయం, ఇక్కడి నుంచి బయల్దేరే రైళ్ల సమయాలు.

	నడిచేరోజులు	ప్రస్తుత సమయం	మారిన సమయం
కిరందూల్-విశాఖపట్నం(18513)	ప్రతీరోజు	తెల్లవారు 2.40	తెల్లవారు 3.40
ఎల్‌టీటీ-విశాఖపట్నం(22848)	బుధ	ఉదయం 05.10	ఉదయం 5.20
సికింద్రాబాద్-విశాఖపట్నం(12784)	ఆది	ఉదయం 9.50	ఉదయం 9.45
భగత్‌కి కోఠి-విశాఖపట్నం(18574)	సోమ	ఉదయం 10.00	ఉదయం 10.05
సికింద్రాబాద్-విశాఖపట్నం(20707)	గురువారం మినహా	మధ్యాహ్నం 1.50	మధ్యాహ్నం 1.45
దుర్గ్-విశాఖపట్నం(20829)	గురువారం మినహా	మధ్యాహ్నం 1.45	మధ్యాహ్నం 1.50
భువనేశ్వర్-విశాఖపట్నం(22819)	ప్రతీరోజు	మధ్యాహ్నం 3.25	మధ్యాహ్నం 3.30
రాజమండ్రి-విశాఖపట్నం(67295)	ప్రతీరోజు	మధ్యాహ్నం 2.50	సాయంత్రం 4.50
కోరాపుట్-విశాఖపట్నం(58537)	ప్రతీరోజు	సాయంత్రం 5.05	సాయంత్రం 5.15
పలాస-విశాఖపట్నం(67293)	ప్రతీరోజు	సాయంత్రం 5.50	సాయంత్రం 6.00
అమృత్‌సర్-విశాఖపట్నం(20808)	సోమ,మంగ,శుక్ర	రాత్రి 9.40	రాత్రి 9.50
సాయినగర్ షిర్డీ-విశాఖపట్నం(18504)	శని	రాత్రి 9.40	రాత్రి 9.50
సికింద్రాబాద్-విశాఖపట్నం(20834)	మంగళ మినహా	రాత్రి 9.31	రాత్రి 9.35
విశాఖపట్నం-రాయ్‌పూర్(58528)	ప్రతీరోజు	ఉదయం 4.25	ఉదయం 4.20
విశాఖపట్నం-సికింద్రాబాద్(20708)	గురువారం మినహా	మధ్యాహ్నం 2.35	మధ్యాహ్నం 2.30
విశాఖపట్నం-కాకినాడ(17268)	ప్రతీరోజు	సాయంత్రం 5.05	సాయంత్రం 5.00
విశాఖపట్నం-దుర్గ్(18530)	ప్రతీరోజు	సాయంత్రం 4.55	సాయంత్రం 4.50
విశాఖపట్నం-షాలిమర్(22854)	బుధ	మధ్యాహ్నం 3.25	మధ్యాహ్నం 3.35
విశాఖపట్నం-ధీఘా(22874)	గురు	మధ్యాహ్నం 3.30	మధ్యాహ్నం 3.35
విశాఖపట్నం-గాంధీదాం(20803)	గురు	సాయంత్రం 5.35	సాయంత్రం 5.30
విశాఖపట్నం-కోర్బా(18518)	ప్రతీరోజు	రాత్రి 9.05	రాత్రి 9.10
విశాఖపట్నం-బనారస్(18311)	బుధ,ఆది	ఉదయం 4.20	ఉదయం 4.15
కోరాపుట్-విశాఖపట్నం(18511)	మంగళ,శని	మధ్యాహ్నం12.00	మధ్యాహ్నం 2.45

బల్క్‌డ్రగ్‌పార్క్‌కు వ్యతిరేకంగా మత్స్యకారుల నిరసన

నక్కపల్లి : మండలంలో రాజయ్యపేట సమీపంలో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయడానికి వీల్లేదంటూ మంగళవారం పలువురు మత్స్యకారులు వినూత్నంగా నిరసన తెలిపారు. రాజయ్యపేట సముద్రతీరంలో ఇసుకపై కుప్పలుగా పోసి బల్క్ డ్రగ్‌పార్క్ వద్దు... అంటూ రాసి తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం పోలీసు బలగాలను మోహరించి బల్క్ డ్రగ్ పార్క్ పనులు ప్రారంభించడం సిగ్గు చేటన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదకర పరిశ్రమలకు బదులు వేరొక పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మండలంలో ఉన్న రసాయన పరిశ్రమల వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నామన్నారు.



కొత్తగా బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో ప్రజలు నివసించే పరిస్థితులు ఉండవన్నారు. రైతులు, నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సీపీఎం మండల కన్వీనర్ ఎం రాజేష్, మత్స్యకారులు సోమేష్, భయ్యన్న, భూలోక, అప్పలరాజు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

సింహాచలం: సింహగిరిపై ఈనెల 10వ తేదీన జరగనున్న వైకుంఠ ఏకాదశికి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. మంగళవారం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించారు. స్వామి వేంజేసే ఉత్తర ద్వారం వద్ద ఏర్పాటు చేయనున్న వేదిక, దాని ఎదురుగా క్యూల ప్రణాళికలపై చర్చించారు. విద్యుత్ దీపాలంకరణ, భక్తులకు మంచినీటి సరఫరా, సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు, అన్నప్రసాదం, పారిశుధ్య పనుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు, దేవస్థానం ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

లేజర్ స్క్రీన్ థియేటర్‌ను ప్రారంభించాలి

అనకాపల్లి: శంకరం పంచాయతీలోని బౌద్ధ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద నూతనంగా నిర్మించిన లేజర్ స్క్రీన్ థియేటర్‌ను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకుని రావాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఏడాది జనవరి 15న బొజ్జన్నకొండ వద్ద కనుమ పండగ, తీర్థం అత్యంత వైభవంగా జరుగుతాయన్నారు. ఇప్పటికే రూ.15 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. బుద్ధుని జీవిత చరిత్ర ఘట్టాలు, బొజ్జన్నకొండ చరిత్ర తెలిపే లేజర్ షో కోసం పర్యాటక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



పాఠశాలకు ప్రింటర్ అందజేస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సూర్యప్రభ

కశింకోట: స్థానిక డీపీఎస్ జెడ్పీ హైస్కూల్లో విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన ఇద్దరు ఉపాధ్యాయులు రూ.25 వేల విలువైన ప్రింటర్‌ను మంగళవారం పాఠశాలకు అందజేశారు. తెలుగు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సూర్యప్రభ పదవీ విరమణ చేయడంతో వారికి పాఠశాల సిబ్బంది, విద్యార్థులు సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు తమ వంతు సహాయంగా స్కూలుకి ప్రింటర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.ఎస్.ఎన్. మూర్తి, హెచ్‌ఎం ఎం.ఆర్.వి. అప్పారావు, ఏపీఈ ఎ. శ్రీధర్‌రెడ్డి, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయులు ఆచంట రవి, ఎన్.జె.వి. ప్రసాద్, కె. అప్పారావు, రామారావు, ఆనంద్, పీడీ వి. ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



కశింకోటలో జోరుగా కేకుల అమ్మకాలు



వివిధ రకాల రంగులు





బొకేలు

న్యూఇయర్ జోష్

- కొంగొత్త ఆశలతో కొత్త సంవత్సరంలోకి
- సందడి చేసిన యువత.. రంగవల్లికలతో అలంకరించిన మహిళలు
- జోరుగా కేక్‌లు, ఫ్రూట్స్, బొకేల అమ్మకం





అనకాపల్లి: పట్టణం నూతన సంవత్సర శోభ సంతరించుకుంది. 2024కు వీడ్కోలు చెబుతూ 2025కు స్వాగతం పలికేందుకు మహిళలు ముంగిళ్ల వద్ద రంగవల్లికలు అలంకరించారు. నూతన సంవత్సరం సందర్భంగా రంగుల అమ్మకాలు, కేక్ విక్రయాలు జోరందుకున్నాయి. పూలు, మిఠాయిలు, పళ్ల దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి. బిర్యానీ అమ్మకం కూడా జోరుగా సాగింది. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకునేందుకు కొత్తకొత్త ఆకృతుల్లో తయారు చేసిన బొకేలు పెద్ద ఎత్తున అమ్ముడుపోయాయి. కొన్ని ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. యువత రహదారులపై సందడి చేశారు.

చర్చిల్లో ప్రార్థనలు..

పట్టణ పరిధిలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. పాత ఏడాదికి వీడ్కోలు పలికి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

హ్యాపీ కిడ్స్ స్కూల్లో..

స్థానిక ఉడ్‌పేట హ్యాపీ కిడ్స్ స్కూల్లో చిట్టిపొట్టి చిన్నారులంతా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గ్రీటింగ్ కార్డులు తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శెశెట్టి గిరీష్ కుమార్, ప్రిన్సిపాల్ సునీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఉడ్‌పేట హ్యాపీ కిడ్స్ స్కూల్లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న చిన్నారులు

జోరుగా స్వీట్లు, కేకుల అమ్మకాలు..

కశింకోట: మండలంలో న్యూఇయర్ సందర్భంగా రంగులు, పూలు, పండ్లు, స్వీట్లు, కేకుల అమ్మకాలు మంగళవారం జోరుగా సాగాయి. ప్రధానంగా యువత, విద్యార్థులు రంగులు, స్వీట్లు, కేకులు వగైరా ఎక్కువగా కొనుగోలు చేశారు. కశింకోట, తాళ్లపాలెం, కన్నూరుపాలెం, నరసింగబిల్లి తదితర గ్రామాల్లో ఎక్కువగా అమ్మకాలు చేశారు. ఇళ్ల ముందు ముగ్గులు వేసి పూలు, రంగులతో అలంకరించారు.



కేకులు



బొకేలు, పూల దండలు

జగన్మోహిని అవతారంలో వేంకటేశ్వరస్వామి



అనకాపల్లి: స్థానిక అంజయ్యకాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారు మంగళవారం భక్తులకు జనన్మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి గోపలాచార్యులు (చక్రవర్తి) మాట్లాడుతూ ధనుర్మాసాన్ని పురస్కరించుకుని వైష్ణవ దేవాలయాల్లో నెల రోజుల పాటు స్వామివారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. స్వామివారి అవతారాల్లో అందరికీ తెలిసినవి 10 అవతారాలని, నారాయణుని అవతారాలు 21 అని ఆయన పేర్కొన్నా రు. అవతారాల్లో దేవ, దానవులు మందర పర్వతం చిలికినప్పుడు వచ్చిన అమృతాన్ని దానవులకు అందకుండా దేవతలకు నారాయణుడు జగన్మోహిని అవతారంలో అందజేశారని, ధనుర్మాసంలో తిరుమలలో మలయప్పస్వామికి (ఉత్సవమూర్తి)కి ఈ అలంకారం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహినిగా ధ్యాన వేంకటేశ్వర స్వామి



కశింకోట: కశింకోటలోని ఆలయంలో ధ్యాన వేంకటేశ్వర స్వామి మంగళవారం జగన్మోహినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా విష్ణుమూర్తి దశావతారాల్లో ఆరో అవతారంగా స్వామిని అందంగా అలంకరించారు. అనంతరం విష్ణు సహస్ర నామార్చన చేశారు. తిరుప్పావై పాశురాలను పఠించారు. రాత్రి 108 దీపాలతో నక్షత్ర హారతి సమర్పించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. స్వామి ఇదే అవతారంలో మరో రెండు రోజులపాటు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీయాలి



గణిత నమూనాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అనకాపల్లి: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మామిడిపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీధర్ కోరా రు. పాఠశాలలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు గణితంపై తయారు చేసిన వర్కింగ్ మోడల్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణితం ఎంతో ప్రాధాన్యమున్న సబ్జెక్ట్ అని, విద్యార్థులు అందులో పట్టు సాధించాలని సూచించారు. గణిత ఉపాధ్యాయుడు బాబు మాట్లాడుతూ పిల్లలు తయారు చేసిన నమూనాలు వారిలో సృజనాత్మకతకు నిదర్శనమని కొనియాడారు. ముందుగా పాఠశాల ఆవరణలోని శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి హెచ్‌ఎం తదితరులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఉత్తమ గణిత నమూనాలను ఎంపిక చేసి, విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయిని శైలజ, దయాసాగర్, సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు



కశింకోట కూడలి విస్తరణ పనులు పరిశీలిస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట: కశింకోటలో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. స్థానిక కూడలిలో జాతీయ రహదారి మధ్య డివైడర్‌ను తొలగించి వెడల్పు చేసి, విస్తరిస్తున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక వైపు కశింకోట రైల్వే స్టేషన్ దారి, మరో వైపు కశింకోట గ్రామానికి రాకపోకలు సాగించే దారి, ఇంకో వైపు జాతీయ రహదారిపై రెండు వైపులా రాకపోకలు సాగించే వాహనాలకు అసౌకర్యం కలగకుండా నాలుగు రోడ్లు కలిసే కూడలిలో డివైడర్‌ను తొలగించి విస్తరిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో అధిక ట్రాఫిక్ సమస్య దృష్ట్యా కూడలిలో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు మండలంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా నిత్యం రద్దీగా ఉండే కూడళ్లలో స్టాప్ బోర్డులు, ప్రమాదాలను సూచించే బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు.

విద్యుత్ చార్జీల భారాన్ని వ్యతిరేకించాలి

కశింకోట: విద్యుత్ సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజలపై రుద్దవద్దని సీపీఎం నాయకుడు దాకారపు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మంగళవారం కశింకోటలో మాట్లాడారు. సర్దుబాటు చార్జీలపై ప్రజలు నిరసన తెలపాలన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పుడా హామీలను తుంగలోకి తొక్కడం శోచనీయమన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొడతామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారని, అధికారంలోకి రాగానే వాటిని విస్మరించారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల ఎస్సీ, ఎస్టీలకు రాయితీలుండవన్నారు. మీటర్ల ఏర్పాటు భారం ప్రజలపై రుద్దుతారన్నారు. స్మార్టు మీటర్ల వల్ల ముందుగానే విద్యుత్ బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా దానికదే నిలిచిపోయి, వినియోగదారులు ఇబ్బంది పడే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, అదనపు విద్యుత్ చార్జీల వసూలును వ్యతిరేకించాలని ప్రజలను కోరారు.

గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జంగం జోషి

అనకాపల్లి: గ్రామీణ వైద్యులంతా కలిసికట్టుగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు జంగం జోషి అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి మహావీర్ ల్యాబ్‌లో మంగళవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2007లో గ్రామీణ వైద్యుల వృత్తి పరిరక్షణకు, కుటుంబాల సంక్షేమానికి 14 మందితో సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. అంచెలంచెలుగా నేటికి 1500 మందిలో సంఘం అభివృద్ధిలో ఉందన్నారు. గ్రామాల్లో ఆర్‌ఎంపీల సేవలు ఎనలేనివన్నారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులను మొదటి దశలో పరీక్షించి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి పంపించడం ద్వారా రోగిని రక్షించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా సంఘం నూతన కమిటీ ఇన్‌చార్జిగా అలకరాజు, కన్వీనర్‌గా శ్రీకాంత్‌ను నియమించినట్లు చెప్పారు. మరో మూడు మాసాల్లో జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ గౌరవాధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, జోనల్ మీడియా కోఆర్డినేటర్ వై.వి.రమణాజీ, సలహాదారు కోన ప్రకాష్, విశాఖ జిల్లా కోశాధికారి ఎం.కృష్ణ, నాయకులు వీరభద్రరావు, రమేష్, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ ఈయూ నిరసన



డిపో గేటు వద్ద నిరసన తెలియజేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

అనకాపల్లి: ప్రజా రవాణాశాఖ (ఆర్టీసీ)లో రూట్ సర్వేలు చేసి బస్‌ల రన్నింగ్ టైమ్‌ను పెంచాలని ఎంప్లాయీస్ యూనియన్ డిపో అధ్యక్షుడు జి.వి.రమణ డిమాండ్ చేశారు. యూనియన్ జోనల్ కమిటీ పిలుపు మేరకు రెండోరోజైన మంగళవారం ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. స్థానిక డిపో గేటు వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి డీఎస్.మూర్తి, ఎన్‌జీవో జిల్లా మహిళా కార్యదర్శి సాలూరు లక్ష్మి, నాయకులు ఎన్ ఈఎస్‌పి రావు, కె.వి.రావు, డి.వి.గణేష్, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులు వరి నూర్చుకోవచ్చు

అనకాపల్లి: వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉన్నందున కోసిన వరిని నూర్చుకోవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు సూచించారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికీ వరి కోయినట్లయితే పొడి వాతావరణం ఉన్నందున్న వరిని కోసుకోవాలని సూచించారు. అపరాల సాగుకు సంబంధించి పలు సూచనలు చేశారు. జీడి మామిడి, బొప్పాయి పంటల సంరక్షణ చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి.శ్రీలత, కె.వి.రమణమూర్తి, బి.భవాని, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయ, విద్యార్థి విభాగాల నుంచి పలు నమూనాలు ప్రదర్శించారు. వీటిని జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, ఎంఈవో పి.జగ్గారావు, కాంప్లెక్సు హెచ్‌ఎంలు శెట్టి మోహన్, దాడిశెట్టి రమేష్ కుమార్ పరిశీలించారు.